క్లుప్తంగా

గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హన్మాండ్లు

కుంటాల: ఆన్‌లైన్ మోసాలు అరికట్టేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోల్డెన్ అవర్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు కోరారు. మండలంలోని లింబా(కే) గ్రామంలో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పోగొట్టుకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా వారంలోగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్తులు తెలపగా ఎస్సై అభినందించారు. సర్పంచ్ మోరె ఆనంద్ రావుపటేల్, ఎంపీటీసీ సునంద గిరీష్‌కుమార్, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, వీడీసీ చైర్మన్ దయానంద్, ఏఎస్సై దేవ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌తోపాటు కాంగ్రెస్ సేవాదల్ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ఖానాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, మజీద్, రాసమల్ల అశోక్, శేషాద్రి, మీర్జాబేగ్, జహీర్ హైమద్, సలీంఖాన్, మ్యాదరి రాజేశ్వర్, జహీర్ ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. చిన్నపిల్లల తలనీలాలు, తులాభారం వేయించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత గుండెవ్యాధుల శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని గుల్జార్ మార్కెట్‌లో ఆదిత్య స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండెవ్యాధుల శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యుడు విద్యాసాగర్ కరణం వారికి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేశారు. చికిత్స అవసరమైన వారికి సిఫార్సు చేశారు. వైద్యుడు రవీందర్, సామాజిక కార్యకర్త షాహీన్ హాష్మి, ఫారూక్, ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రదర్శనలు



ప్రదర్శనలు పరిశీలిస్తున్న అన్నపూర్ణ

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని వాసవి వరల్డ్ పాఠశాలలో ఆదివారం టాలెన్షియ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్, గణిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రోబోటిక్, ఫుడ్‌స్టాల్, ఆర్ట్, క్రాఫ్ట్, నేటి సమాజానికి ఉపయోగపడే విజ్ఞాన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ అన్నపూర్ణ ప్రదర్శనలను పరిశీలించారు. విద్యాసంస్థల డైరెక్టర్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రటరీ జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు రాజ్‌కుమార్, శ్రీనివాస్, శైలజ జైనస్, సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు కన్నీరు!

- మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1400 నుంచి రూ.1600 ధర
- ఆందోళనలో రైతులు



లోకేశ్వరం సంతలో ఉల్లిగడ్డలు



వట్టోలిలో సాగైన ఉల్లి

లోకేశ్వరం: ఉల్లి రైతుకు కంట కన్నీరు పెట్టిస్తుంది. రోజురోజుకు ధర పడిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి రాని పరిస్థితి ఉంది. గతేడాది క్వింటాల్ రూ.3100 నుంచి రూ.4 వేల ధర పలకడంతో ఈ ఏడాది అదే ధర వస్తుందని రైతులు జిల్లాలో ఉల్లిసాగు చేశారు. దిగుబడి చేతికందే సమయానికి ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ.1400 ధర పలుకుతోంది. కనీసం నారుకు ఖర్చుచేసిన డబ్బులు వచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

జిల్లాలో..

జిల్లాలోని ప్రస్తుతం ఉల్లి పంట చేతికి వస్తోంది. మార్కెట్‌లో క్వింటాల్ రూ.1400–1600 ధర పలకడంతో రైతులకు పెట్టుబడి రాని పరిస్థితి. లోకేశ్వరం, తానూర్, కుభీర్, ముధోల్, లక్ష్మణచాంద మండలాల్లో సుమారు 153 ఎకరాలకు పైగా సాగుచేశారు. పంట చేతికి రాకముందు కిలో రూ.40 ధర పలకడంతో లాభాలు వస్తాయని ఆశపడ్డారు. ధర పడిపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. పంటను నిల్వచేద్దామంటే స్థానికంగా కోల్డ్‌స్టోరేజీలు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటకు తెగుళ్లు

ఉల్లి పంట చేతికి వచ్చే సమయానికి తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరంలో ఉల్లి సాగు చేస్తే 180–200 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ప్రస్తుతం 60 క్వింటాళ్లు కూడా దాటడం లేదు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ వివరణ అడిగితే వాతావరణ మార్పుల కారణంగా ఉల్లి పంటలకు తెగుళ్లు సోకే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. విత్తే నాటి నుంచి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి



భైంసాలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలి. దిక్కులేని పరిస్థితుల్లో రైతులు ఎప్పటికప్పుడు ఉల్లిని విక్రయిస్తున్నారు. తర్వాత తిరిగి ధరలు పెరుగుతున్నాయి. దీంతో నష్టపోవాల్సి వస్తోంది. రైతులకు న్యాయం చేయాలి.

– ఎడ్ల చిన్నసాయన్న, వట్టోలి ఉల్లి రైతు

క్వింటాలు రూ.4వేలకు కొనాలి



ఉల్లి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి. క్వింటాలు రూ.4 వేలకు కొనాలి. మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు పతనమయ్యాయి. పంట రవాణా, కూలీల ఖర్చుపోను లాభాలు ఏమాత్రం రావడం లేదు.

– ప్రవీణ్, నగర్‌తండా ఉల్లి రైతు

విషజీవుల బాంధవులు



పట్టుకున్న పాముతో మహమ్మద్ ఫిరోజ్ ఖాన్(ఫైల్)



జనావాసాల్లో పట్టుకున్న పాముతో అనిల్‌కుమార్ (ఫైల్)

- పాముందని ఫోన్ చేస్తే చాలు
- వెంటనే వచ్చేస్తారు..పట్టేస్తారు
- అడవుల్లో వదులుతున్న స్నేక్ క్యాచర్స్ ఫిరోజ్, అనిల్

నిర్మల్‌ఖిల్లా: పాము కనిపిస్తే చాలు..అల్లంత దూరాన పారిపోతాం. ఒకవేళ కాటేస్తే భయంతో గుండెకొట్టుకునే వేగం పెరిగి ప్రమాదానికి దారితీస్తుంది. మరికొన్ని విషపూరితమైన పాము కాటేస్తే నిమిషాల వ్యవధిలో మరణం సంభవిస్తుంది. అలాంటి విషసర్పాలను నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన గిరిగంటి అనిల్‌కుమార్, మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ అలవోకగా పట్టేస్తున్నారు. పాము కనిపించిందని ఫోన్ వస్తే చాలు నిమిషాల వ్యవధిలో వారు అక్కడికి వెళ్లి పట్టుకుంటున్నారు. అడవి ప్రాంతంలో వదిలేస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నారు.

పాము పట్టడం అలవాటు..

జిల్లాకేంద్రానికి చెందిన గాజులపేట్‌కు చెందిన మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ తన 12వ ఏటా నుంచి పాములను పట్టుకోవడం అలవాటుగా మారింది. ఎక్కడ పాము కనిపించినా పరిసర ప్రజలు అతనికి ఫోన్‌చేసి పిలిపిస్తున్నారు. ఇంటి వాకిలి, పాత ఇంటి అటక పైన, ఇరుకు సందులు, సామాను ఉంచిన గదులు, వాణిజ్య సముదాయాలు, కిరాణాషాపుల్లో పాము కనిపించిందని తెలిస్తే చాలు వచ్చి పట్టుకోవడం ఇతని ప్రత్యేకత. వర్షాలు పడిన సందర్భంలో జనావాసాల్లో పాములు కనిపిస్తుంటాయి. ఇప్పటివరకు వీటిని బంధించినప్పుడు ఎవరి వద్ద ఒక్క రూపాయి తీసుకోలేదు.

పాములు పట్టడంలో దిట్ట

జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన గిరిగంటి అనిల్‌కుమార్ పాలకేంద్రం నడుపుకుంటున్నాడు. ఇతను పాము పట్టడంలో దిట్ట. ఎంత చిన్న కలుగులో ఉన్నా సరే దాన్ని ఇట్టే పట్టేస్తాడు. సంచిలో వేసుకుని దూరంగా వదిలేస్తాడు. ఒక్క రూపాయి ఆశించకుండా వాటిని పట్టుకుంటాడు. విష సర్పాలు స్వభావరీత్యా ఆత్మరక్షణకు మాత్రమే కాటేస్తాయని వాటిని అనవసరంగా చూసి ఆందోళన వద్దని అనిల్‌కుమార్ భరోసా కల్పిస్తాడు. రక్త పింజర, నాగుపాము, కట్లపాము, అనకొండ వంటి విషరసర్పాలను మొదలుకొని అన్ని రకాల పాములను చాకచక్యంగా పట్టుకుంటాడు. తన చిన్నతనంలో పశువులను కాసేటప్పుడు అనుకోకుండా చూసిన పామును ఆత్మ రక్షణ కోసం దొరకబుచ్చుకుని దూరంగా విసిరేశాడు. అప్పటినుంచి పాములను ఒడిసి పట్టుకోవడం అతనికి అలవాటైంది.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



అర్లి వంతెన

నర్సాపూర్(జి): ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు..సుమారు 40 ఏళ్ల క్రితం అర్లి (కె) సుద్దవాగుపై నిర్మించిన వంతెన. కాలక్రమేణా వాహనాల రద్దీ పెరగడంతో వంతెన ఇరుకుగా మారడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు. వంతెన పై నుంచి ఒక వాహనం వస్తుండగా మరో వాహనం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ వంతెన గుండా ప్రతినిత్యం భైంసా నుంచి లోకేశ్వరం మండలం పంచగుడి మీదుగా నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్ వరకు బస్సులు ప్రయాణిస్తుంటాయి. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు వారధిలాగా ఉపయోగపడుతోంది. వివిధ పనుల నిమిత్తం అనేక వాహనాల్లో ప్రజలు వెళ్తూ వస్తుంటారు. గత భారీ వర్షాలకు వంతెన ముందు భాగం దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేశారు. అనంతరం మరమ్మతు చేపట్టారు. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణానికి రూ.46 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆర్థికశాఖ నుంచి అనుమతులు లభించాయి. కాని ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అర్లి వంతెనపై నుంచి వాహనం వస్తుండగా నిలిచి ఉన్న మరో వాహనం

ట్రా'ఫికర్'

జిల్లా కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల రద్దీ ఎక్కువవుతోంది. శివాజీ చౌక్, వివేకానంద చౌక్, ప్రొఫెసర్ జయశంకర్ చౌక్‌లో వాహనదారులు ఇష్టారీతిగా వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా పట్టించుకోకుండా ముందుకెళ్తున్నారు. రోడ్ల వెంబడి ఉన్న ఫుట్‌పాత్‌లపై పండ్ల దుకాణాలు, టేలాలు ఏర్పాటు చేసినా ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు. ప్రధాన షాపింగ్ మాల్స్ ఎదుట వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



కిసాన్ షాపింగ్ మాల్ ఎదుట..



శివాజీచౌక్‌లో..



రోడ్లను ఆక్రమించుకున్న పండ్ల దుకాణాలు



బస్టాండ్ నుంచి వివేకానందచౌక్ వరకు ..

నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో మంజులాపూర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ కిరాణా షాపు అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆమెడ శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా పోలిశెట్టి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా పడిగెల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా పుర్విందర్, వైస్ ప్రెసిడెంట్లుగా నాగనాథ్, తోట చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజు, శ్రీరామ్ తదితర సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిని పలువురు శాలువతో సత్కరించారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన ఆమెడ శ్రీధర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

అంగన్‌వాడీ టీచర్స్(టీఎన్‌జీవో)..

కడెం: మండల అంగన్‌వాడీ టీచర్స్(టీఎన్‌జీవో) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జాడి రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా నేదురి విజయనిర్మల, సలహాదారుగా రత్నమాల, కమిటీ మెంబర్లుగా సుగుణ, సునీత, భాగ్యరేఖ, సెక్టార్ లీడర్‌గా భూపేంద్రకౌర్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు లీలారాణి, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ యువజన కార్యవర్గం

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామ అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ గంగాధర్, కార్యదర్శిగా యు.రవి, కోశాధికారిగా కె.గౌతం, సభ్యులుగా కాంతారావు, సురేష్, రాజు, సాయన్న, సాయినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి తమ వంతుగా కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

'కేటీఆర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'

ముధోల్: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు మానసిక పరిస్థితి దెబ్బతిందని ముధోల్ నియోజకవర్గ టీజేఎస్ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా కోదండరాంను ప్రభుత్వం నియమించడం పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. గత తొమ్మిదేళ్లలో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులను గుర్తించి ఎమ్మెల్సీ ఇస్తే కేటీఆర్ ఇష్టారీతిగా మాట్లాడడం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కారు షెడ్డుకెళ్లి బీఆర్‌ఎస్ కనుమరుగవడం ఖాయమని జోస్యం చెప్పారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

ముధోల్: పెండింగ్‌లో ఉన్న వాహన చలాన్లు వెంటనే చెల్లించాలని ఎస్సై సాయికిరణ్ అన్నారు. ముధోల్‌లో ఆదివారం ద్విచక్రవాహనాదారులతో ఎస్సై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగంతో, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

ఉద్యోగం సాధించిన ముగ్గురు మహిళలు

నర్సాపూర్(జి): మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ముగ్గురు మహిళలు నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు సాధించారు. జామిడి స్వరూపరాణి, సుంక లీలావతి, కోటగిరి కళ్యాణి ఇదివరకు కాంట్రాక్టు పద్ధతిలో ఆయా డిపార్ ఉద్యోగాలు చేస్తూ గత ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాల్లో ఉద్యోగం సాధించిన వీరిని పలువురు అభినందించారు.



స్వరూప రాణి లీలావతి కళ్యాణి

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: గణతంత్ర వేడుకలు పురస్కరించుకుని ఆరోగ్యశ్రీ సేవల్లో జిల్లా ఉత్తమ హాస్పిటల్‌గా (స్వప్న మల్టీస్పెషలిటీ హాస్పిటల్)గా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా డాక్టర్ స్వప్న శశికాంత్ దంపతులను ఎస్టీయూ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, జిల్లా అధ్యక్షులు ఎస్.భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, సారంగాపూర్ మండల అధ్యక్షుడు మఠం పరమేశ్వర్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఖానాపూర్: మస్కాపూర్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో మండలంలోని మస్కాపూర్‌లో సీజన్–1 క్రికెట్ టోర్నీని ఎస్సై లింబాద్రి ఆదివారం ప్రారంభించారు. యూఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టోర్నీని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మధు, సన్ని, సాయి, గంగాధర్, రాజేందర్, ఆసిఫ్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలతోపాటు జ్ఞాపిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వృథాగా భగీరథ నీళ్లు



లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో ఆదివారం మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధానపైపు లీకేజీ అయింది. దీంతో నీరువృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైపునకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తానూరు: భైంసా నుంచి తానూరుకు సరఫరా చేసే 33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జాదవ్ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు గమనించాలని కోరారు.

రాజూరాలో 'ఉపాధి' గ్రామసభ

ఖానాపూర్: మండలంలోని రాజూరా గ్రామంలో ఆదివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను సామాజిక తనిఖీ గ్రామసభను ఆదివారం నిర్వహించారు. తనిఖీ బృందం ఏడాదిలో జరిగిన పనుల వివరాలను అధికారులు చదివి ప్రజలకు వివరించారు. ఇందులో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం

లక్ష్మణచాంద: ఎంపీడీవో కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.